# కాడి

అతను వెళ్లిపోయాక అద్దంలో చూసుకుంటే చిన్నప్పుడు కోపంతో ఆడుకునే బొమ్మని తను యిష్టం వచ్చినట్టు పీకి పాకం పెట్టటం గుర్తొచ్చింది స్వర్ణకి. దాని జుత్తు పీకి కళ్ళు పొడిచి విసిరి పారేయడం గుర్తొచ్చింది. కొబ్బరి పీచులా వున్న తన జుత్తు దువ్వుకుంటూ వుంటే ప్రాణం పోతున్నంత నెప్పి, మొహం కడుక్కుంటూ వుంటే పెదవులు, బుగ్గలు నిప్పులో పెట్టినంత మంట. తనకి బాగా జ్ఞాపకం... మూడేళ్ళప్పుడనుకుంటా.. నూనె వలకబోసినందుకు అమ్మ కొట్టింది. బాగా కొట్టింది. చెప్పకుండా సినిమాకి వెళ్ళినందుకు పదేళ్లప్పుడు నాన్న కొట్టాడు. అమ్మా నాన్నా అప్పుడప్పుడూ కొడుతూనే వుండేవాళ్లు. కానీ ఇవాల్టి యీ దెబ్బల్లా అవి ఎప్పుడూ ఇంత సలపరించలేదు. చూస్తూ చూస్తూ వుండగానే పెదిమలు వాచిపోయాయి. బుగ్గలు బెలూన్లలా ఉబ్బిపోయాయి. వీపు విమానం మోత మోగిపోయింది. స్వర్ణ మెల్లిగా చీరె మార్చుకుని తన బట్టలన్నీ ఒక సంచిలో సర్దుకుని తలుపు తాళంవేసి తాళంచెవి పక్కవాళ్లకిచ్చి ఒక ఆటో ఎక్కి అమ్మ దగ్గరకొచ్చింది. అప్పుడే హోటల్లో అంట్లు తోమి ఇంటికొచ్చి చాపమీద నడుంవాల్చింది దుర్గ. గుమ్మంలో అడుగుపెడుతూనే సంచీ ఓ మూలకి గిరాటు పెట్టి, "ఇదుగో చూడు నీ కూతుర్ని, పదివేలు తగలేసి పెళ్ళి చేసి పంపావుగా!" అంది.

దుర్గ ఉలిక్కిపడి లేచి కూచుంది. మూణ్ణెల్లకే ముప్పై ఏళ్ళు పెద్దదాన్లా కనిపిస్తున్న కూతుర్ని చూసింది. ఇప్పుడు కదిలిస్తే అది మీద పడి రక్కుతుందని తెలిసి మాట్లాడకుండా ఊరుకుంది.

కొట్టుకోడాలు కొత్తవేం కావు. కొట్టుకోడం తిట్టుకోడంతో కాక జీవితాలు ఎట్టా వెడతయ్! కానీ మరీ ఇంత తొందరగా, ఇంత ఇదిగానా! ఒక అరగంట గడిచాక లేచి టీ పెట్టి స్వర్ణకిచ్చి, "అసలేమైందే?" అని ధైర్యం చేసి అడిగింది. స్వర్ణ ఏడ్చుకుంటూ బెక్కుతూ

చెప్పలేదు. కోపంగా చెప్పింది. తన వేపు వేలు చూపిస్తూ చెప్పింది. అప్పటికి దుర్గ మాట్లాడకుండా ఊరుకుంది. స్వర్ణ వెళ్లి ఓ మూల బొంత పరుచుకుని పడుకుంది. కూతురు నుదిటి మీద చెయ్యిపెట్టి చూసి జ్వరం వచ్చేలాగా వుందని గ్రహించి నెప్పులు, జ్వరం తగ్గే మందుబిళ్ల ఒకటి ఇచ్చి ఇంకో కప్పు టీ ఇచ్చి కూచుంది దుర్గ. సాయంత్రం ఆరింటిదాకా అట్లా పడుకునేవుంది స్వర్ణ.

"నువ్వు పడుకో. నేను పనికి పోయొస్తా.. అతనొచ్చినా వెళ్లకు.. తలుపేసుకు పడుకో..." అని పనికి పోయింది దుర్గ. చాలాసేపటి తరవాత లేచి లైటు వేసుకుని కిటికీ దగ్గర కూచుంటే నాన్న గుర్తొచ్చాడు. ఇట్టాగే ఈ కిటికీ దగ్గరే ఆరునెల్లు మంచానపడి వున్నాడు. నాన్న కూడా అమ్మని కొట్టేవాడే! నాన్న అమ్మని కొట్టేటప్పుడు ఒక్కొక్కసారి అమ్మదే తప్పని అనిపిస్తూ వుండేది. ఆయన చెప్పినట్లు వింటే పోలేదా అనిపించేది. అది నిజం కాదని ఇప్పుడు అనిపిస్తోంది.

అమ్మ తెల్లగా వుంటుంది. శుభ్రంగా కూడా వుంటుంది. నాన్నా బాగానే వుంటాడు. ప్యాంట్ వేసుకుంటే సినిమా హీరోలాగా వుంటాడు. కాని శుభ్రంగా వుండడు. నాన్న శుభ్రంగా వుండడం, మంచి బట్టలు వేసుకుని సరదాగా వుండడం తను చూసింది చాలా తక్కువసార్లు. అసలు నాన్న అట్లా ఎందుకైపోయాడో అర్థం కాదు. తను పుట్టకముందు పల్లెటూళ్ళో ఉన్నప్పుడు నాన్న బాగుండేవాడంటుంది అమ్మ. తను ఆడపిల్ల కావడం ఒక పెద్ద తప్పట. మూడోసారైనా మగపిల్లవాడు పుడతాడని నాన్న చాలా ఆశపడ్డాట్ట. కాని, నాన్న తనని చిన్నప్పుడు బాగానే చూసేవాడు. అమ్మాజి కన్న తననే ఎక్కువసార్లు సినిమాకి తీసుకెళ్ళేవాడు. అమ్మాజి అమ్మలా తెల్లగా వుంటుంది. నాన్నలా పొడుగ్గా వుంటుంది. అమ్మలా కష్టపడి పనిచేస్తుంది. అందుకే అదంటే నాన్నకి కిట్టేది కాదేమో!

అమ్మతో పనికిపోయి నెలకి వెయ్యి రూపాయలు తెచ్చేది. అమ్మాజి చాలామంచిది. ఇప్పుడుంటే తనని ఎట్లా సముదాయించేదో! అమ్మ సముదాయించదు. ఎందుకంటే సముదాయిస్తే ఆ తింగరి వెధవనొదిలేసి వచ్చేస్తుందని భయం అమ్మకి. అమ్మ ఇచ్చిన మందు బిళ్లకి కాసేపు నొప్పులు తగ్గినట్లే తగ్గాయి కానీ మళ్లీ సలపరిస్తున్నయ్. పొద్దున తను తిండి కూడా తిన్లేదు. కడుపులో ఒకటే తిప్పేస్తోంది. పర్సులో ఇంకా కాసిని డబ్బులున్నాయి. కానీ ఈ అవతారంతో బయటికిపోతే అంతా చూస్తారు. కొందరైతే దీని పొగరు బాగా అణిగిందని సంతోషిస్తారు. అమ్మ ఇప్పుడే రాదు. ఒక ఏడాది కిందట ఎట్లా వుండేవాళ్ళు, తనూ, అమ్మా! అమ్మ హోటల్లో పనికిపోతే తను కూడా పనిచేసుకుని పదిపన్నెండొందలు తెచ్చేది. రమతో పాటు వారానికో సినిమా చూసేది. గాజులో, గోళ్లరంగులో, గోరింటాకో ఏం కొనుక్కోవాలన్నా కాసిని డబ్బులుండేవి. తిండి కూడా

చాలావరకూ పనిచేసే ఇళ్లల్లోనే గడిచిపోయేది. అసలు నాన్న మందులకి, పళ్లకి, రొట్టెలకి తన డబ్బులెంత ఖర్చు పెట్టేది! నాన్న బ్రతికితే చాలని అమ్మా తనూ అనుకునేవాళ్లు. ఇళ్లల్లో 'ఎగ్స్ట్రా' పనులు చేసి అమ్మకి చెప్పకుండా కాలిపట్టీలు కొనుక్కోడానికి దాచుకున్న డబ్బులు కూడా నాన్న కోసం ఖర్చుపెట్టింది. అట్లా ఖర్చుపెట్టటం ఎంత బాగుండేదో! అమ్మ పనికి పోతే తను నాన్న దగ్గర కూచుంటే ఒక్కొక్కసారి ఆయన ఏడ్చేవాడు.

పెదిమెలు మండుతున్నయ్. జుత్తు నొప్పి. తలపోటు... మళ్ళీ కళ్ళుమూసుకుని బొంతమీద పడుకుంది స్వర్ణ. ఇంట్లో ఒక్కటే ఒక్క మంచం వుండేది. దానిమీదే నాన్న పోయాడు. ఆ మంచం పనికిరాదని ఎవరికో ఇచ్చేశారు.

* * *

"చిరంజీవి సినిమాకి రెండు టిక్కెట్లు తెచ్చా మార్నింగ్ షోకి. స్వర్ణా, నేనూ పోతాం. మాకేదైనా తింటానికి పెట్టిప్పుడు, వచ్చి అన్నం తింటాం" అన్నాడు నాన్న.

"రెండు టిక్కెట్లేంది? అమ్మాజీని తీసుకుపోవా?" అమ్మ.

"అదొచ్చిన కాణ్ణించి పోకిరి ఎధవల కళ్ళన్నీ దానిమీదే. అదొద్దు. పెళ్ళికొచ్చిన పిల్లల్ని అట్లా సినిమాలకి తిప్పకూడదు."

"మరి పెళ్ళి చెయ్యి" అమ్మ.

నాన్నకి కోపం వచ్చింది. "ఏం నువ్వా సంపాయిస్తన్నావ్‌గా. ఎంకటేస్సర్రావింటో పనిచేసి! నువ్వు చెయ్యి దాని పెళ్ళి" అన్నాడు.

"నేనుకాక నువ్వు చేస్తావని నాకేం ఆశల్లేవులే. పెద్దదాని పెళ్ళి మాత్రం నువ్వు చేశావా? ఏదో మా తమ్ముడు దయతలచి చేసుకున్నాడు కనక దానికి పెళ్ళయింది" అంది అమ్మ.

"అవునే నేనేం చేస్తా. నువ్వూ నీ ఎంకటేస్సర్రావూ కలిసి చెయ్యండి."

ఇట్లా రెట్టించుకుంటే ఏదో ముంచుకొస్తుందని అమ్మాజీకి తెలుసు. అందుకే గబగబా రెండురొట్టె ముక్కలు పోసి తెచ్చి "తిను నాన్నా. సినిమాకి టైం అవుతోంది" అంది. ఆ ప్లేటు అందుకుని ఒక్క విసురున అమ్మకేసి కొట్టాడు. అట్లా చేస్తాడనుకోలేదు కదా అమ్మ! అక్కడే నిలబడిపోయింది.

పళ్ళెం వచ్చి మొహానికి కొట్టుకుంది. మొన్న ఎవరిదో పుట్టినరోజయితే వాళ్ళిచ్చారు. కొత్తది. అంచులు చాలా పదునుగా వున్నాయ్. మొహం చిట్లింది. నెత్తురొచ్చింది. వేడి రొట్టెలెళ్ళి ఎక్కడో పడ్డయ్. అమ్మాజీ గబగబా ఇంత కాఫీపొడి తెచ్చి అమ్మ మొహాన అద్దింది. అమ్మ తిట్లకి లంకించుకుంది. నాన్న బూతులు మొదలేసుకున్నాడు. కోపంగా టిక్కెట్లు చింపేసి బయటికి పోయాడు. అప్పుడు అమ్మమీదే తనకి కోపమొచ్చింది. అమ్మ

వెంకటేస్సర్రావింట్లో పనిచెయ్యటం నాన్నకిష్టం లేదు. అసలు ప్రతిదానికీ ఆయన్ని కష్టించటం ఎందుకు? నిక్షేపంగా సినిమాకెళ్ళేది కాస్తా చెడగొట్టింది. ఇక మళ్ళీ ఎప్పటికో నాన్న సినిమాకి తీసుకెళ్ళేది! అసలు అమ్మాజీకి ఎన్నేళ్ళని, ఊర్కే పెళ్ళి పెళ్ళి అని చంపుకు తింటుంది అమ్మ! హాయిగా పనికి పోయి బోలెడు డబ్బులు సంపాయిస్తోంది కదా!

"ఆ ఎంకటేస్సర్రావింటో పని మానెయ్" అంది స్వర్ణ కోపంగా.

"నోర్మూసుకో! అక్కడ పని చెయ్యమట్టే రోజూ తిండి తింటున్నాం" అని గదిమింది అమ్మ. నాన్నే రైటు ఎంకటేస్సర్రావు మంచోడు కాదు అనుకుంది స్వర్ణ.

"సినిమా లేదుగా. ఇంటో ఎందుకు? బడికి పో" అంది అమ్మాజీ.

"నేను బడికి పోను. నాకేం అర్థం కావట్లేదు పాఠాలు. పంతులమ్మ రోజూ కొడుతుంది."

"నేను చదువుకుంటానంటే అమ్మ బడి మాన్పించి పన్లో పెట్టేసింది. కనీసం ఏడోక్లాసన్నా మిణుకు..."

"నేను కూడా నీకు మల్లే పని చేస్తా"

అమ్మ కొట్టటానికి చెయ్యెత్తింది. అక్కణ్ణించి పారిపోయింది స్వర్ణ. అమ్మాజీ ఏడోక్లాసు పేసైంది. ఆ పైన చదువుకుంటానంటే అమ్మ వద్దంది. అప్పటిదాకా నాన్న కాస్తో కూస్తో ఇంటికి డబ్బులిచ్చేవాడు. రాను రాను ఆయన సంపాదన ఆయన తాగుడుకే చాలకుండా పోయింది. అసలు ఈ వూరొచ్చిన కొత్తలో అమ్మ పనికి పోయేది కాదంట. నాన్న తెచ్చే డబ్బులే సరిపోయేవంట. అందుకే అమ్మాజీ బడికి పోయినా అమ్మ వూరుకుంది. నాన్న తాగుడు మరీ ఎక్కువై. ఏ పనీ సరిగ్గా చెయ్యకపోయేసరికి ఇంక అమ్మా, అమ్మాజీ ఇద్దరూ పని చెయ్యాల్సొచ్చింది... స్వర్ణకేమో అయిదోక్లాసే కష్టంగా ఉంది. పంతులమ్మలూ, అయ్యవార్లూ చెప్పేది తక్కువా, అరిచి తిట్టేది ఎక్కువా! అమ్మేమో నోటుబుక్కులు సరిగ్గా కొనదు. పెనసలి కొనమంటే రేపంటుంది.

స్వర్ణ బడికి పోయి వారం అయింది. ఒక అయిస్ కొనుక్కుందామన్నా అర్ధరూపాయుండదు. నాన్నా యివ్వడు, అమ్మా యివ్వదు. అప్పుడు జోతమ్మ బ్యూటీ పార్లేరులో పని దొరికింది స్వర్ణకి. కత్తిరించిన జుట్టు ఎత్తిపొయ్యడం, ఆవిడ మొహాలు రుద్దేటప్పుడు అదీ యిదీ అందించడం, టీలు తేవడం, పార్లేరు ఊడ్చి, తుడవడం లాంటి పనులు. రోజుకి పదిహేను రూపాయలు. సెలవురోజు లేదు. తను మానేసినా లేదు. నెలకొకసారే జీతమిచ్చేది. ఈ పని తనకు తనే మాట్లాడేసుకుంది స్వర్ణ. అమ్మకి, అమ్మాజీకి చెప్పకుండా...

"ఏందే. ఇంక బడికెల్లవా?" అంది అమ్మ ఒకరోజు.

తనేం చేస్తోందో చెప్పింది స్వర్ణ.

"చదివి చేసేదేముందిలే. ఎంతో పెద్ద చదువు చదివితేగాని ఉద్యోగాలు రావు. అంత చదువు నా వల్లాగాదు. పిచ్చ తిరుగుడు తిరక్క ఆ పని సరిగ్గా చేసుకో" అంది.

ఆ నెల అయిదు శుక్రవారాలు రావటంతో ఇరవై ఆరు రోజుల జీతం వచ్చింది స్వర్ణకి. సాచ్చాత్తూ, పది తక్కువ నాలుగొందలు. జీతంతెచ్చి అమ్మ చేతిలో పెట్టి, "చెప్పులు తెగిపోయినయ్. చెవి పోగులు నల్లబడిపోయినయ్" అంది. అమ్మ తన వంక ఆశ్చర్యంగా చూసి, "సాయింతరం బీసెంటురోడ్డుకెళ్ళి కొనుక్కుందాంలే" అంది. పొద్దున్న పదింటికి పోతే రాత్రి తొమ్మిదింటికి వస్తుంది స్వర్ణ. అమ్మ డబ్బాలో ఇంత మజ్జిగన్నం పెట్టిస్తుంది మధ్యాహ్నం తినటానికి.

అక్కడ జ్యోతి మేడమ్‌తోపాటు, తనకన్న ముందొచ్చి స్వంతంగా కనుబొమ్మలు దిద్దటం, పాదాలు రుద్దటం లాంటివి చేసే పెద్ద పిల్లలు కూడా స్వర్ణమీద పెత్తనం చేస్తూ వుంటారు. ఎవరైనా కష్టమర్లు అయిదూ, పదీ స్వర్ణ చేతిలో పెట్టినా గుంజుకుంటారు. వాళ్ళు మాత్రం సందైతే ఏదో ఒకటి తింటూ వుంటారు. మేడమ్ ఇదంతా పట్టించుకోదు. వాళ్లని ఎట్లా ఎదుర్కోవాలో ఆలోచించుకునేది స్వర్ణ.

ఒకరోజు తాముండే కొండ కింద ఇళ్ళల్లో ఒక దాంట్లో ఉండే దుర్గ జ్యోతమ్మతో ఏదో పనుండి వచ్చి తనని చూసి పలకరించి ఎంత జీతమని అడిగింది. తను చెప్పి దుర్గ సంగతి అడిగింది.

ఒక మందుల కంపెనీలో మందుసీసాలు అట్టపెట్టెల్లో పెట్టి సీల్ వేసే పనిట. ఒక్కొక్క సీసాకి ఇరవై పైసలు ఇస్తారంట. ఎన్ని చేస్తే అన్ని. వారానికొకసారి ఇస్తారట. తనకైతే రోజుకి ఇరవై తక్కువరావట. ఆదివారం సెలవు. పదింటికి వెడితే ఆరింటికంతా ఇంటికొచ్చెయ్యచ్చు. అయితే పదిహేనేళ్ళకి తక్కువుంటే చేర్చుకోరట.

పదిహేనేళ్లని ఎలాగోలా అబద్ధమాడి ఆ ఉద్యోగం సంపాయించింది స్వర్ణ. అప్పటికి బయటి ప్రపంచంలో వచ్చిన అనుభవంతో, తనంత తను ఏదైనా కొనుక్కుతినటం, అమ్మకి చెప్పకుండా అయిదూ, పదీ అవతల పెట్టుకోడం నేర్చుకుంది. అమ్మేం అనడం లేదు. పుస్తకాలు, పెన్సిళ్ళు కొనడం తప్పిపోగా, రెండుమూడొందలు చేతికి రావటం బాగున్నట్టుంది. అమ్మాజీకే తనిలా పనికిపోవడం ఇష్టం లేదు. కనీసం పుస్తకాలు చదవటం, ఏదైనా రాయటం అయినా రాకుండా చదువు మానడమేమిటంటుంది. అమ్మాజీ పేపర్ చదువుతుంది. ఎవరన్నా అడిగితే ఏదైనా రాసి పెడుతుంది. తను అయిదులోకొచ్చినా బాగా చదవలేదు. తన పేరు కూడా సరిగ్గా రాయలేదు. ఏం చదువులెద్దూ! ఎంత చదివితే ఉద్యోగాలొస్తయ్! డబ్బులున్న వాళ్లకే చదువులు. ముందు డబ్బులుండాలి. కడుపునిండా తినాలి. ఎప్పుడన్నా ఒక సినిమాకి పోవాలి. కాలిపట్టీలో, జడపిన్నులో కొనుక్కోవాలి. ఎప్పుడో ఇంకో పదేళ్ళో పదిహేనేళ్ళో కడుపుకట్టుకుని చదివి అప్పుడు సంపాదించడం అంటే కష్టం అనిపించేది. చదువుకోడం

అంటే అమ్మగార్ల పిల్లల్లాగా చదువుకోవాలంతే! నాన్నకిప్పుడు సరైన పనేలేదు? ధర్నాలూ, ఊరేగింపులూ ఉంటే వాటికి వెళ్లటం, ఆ వచ్చిన డబ్బులేవో తాగెయ్యటం.

"ఆ మనిషి ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే" అంది అమ్మ ఒకరోజున.

"అట్టా అనకు. ఇంటో మగమనిషి ఉన్న దారే వేరు... నాన్న ఇంటో లేకపోతే ఈ కొండమీద మగపిల్లల చూపులన్నీ యిటే... అయన రాంగానే ఎక్కడి వాళ్ళక్కడ గప్చిప్!" అంది అమ్మాజీ... మందుల కంపెనీ ఎత్తెయ్యడంతో ఆ ఉద్యోగం పోయి, మళ్ళీ ఇంకో పార్లర్‌లో చేరింది స్వర్ణ. ఈసారి మేడమ్ స్వర్ణకి గౌన్లు మాన్పించి చుడీదార్లూ దానిమీద చున్నీలు వేయించి, పాదాలు రుద్దటం, వ్యాక్సింగ్ లాంటివి నేర్పించి నెలకి అయిదువందలు జీతం చేసింది. చదువులోకన్న, యీ పనులు చురుగ్గా చేస్తోంది. టిప్‌లు కూడా వస్తున్నాయి. టిప్పులు దాచుకుని జీతం అమ్మకిస్తుంది.

అమ్మాజీకి సంబంధమొచ్చింది. కట్నం వద్దంట. కానీ మంచం, రెండు ప్లాస్టిక్ కుర్చీలు, ఒక వాచి, కుటుంబానికి బట్టలూ అడిగారు. వాచీ, కుర్చీలూ పెద్దక్క ఇస్తానంది. బట్టలూ, మంచం, పెళ్ళి ఖర్చులూ వాటికి అప్పు చెయ్యాలి. అమ్మాజీ ఇప్పటిదాకా అమ్మగార్ల పిల్లలు వాడేసిన చుడీలే వేస్తోంది. పెళ్ళైనాక చీరెలే కట్టాలని వాళ్ళు రూల్సు పెట్టారు. మరి దానికి నాలుగు చీరెలు, వాటికింద లంగాలు, జాకెట్లు ఇవ్వన్నీ కొనాల్సొచ్చింది. ఒంటిమీద చిన్నం బంగారమన్నా లేకపోతే ఎట్లా అని ఎర్రరాయి నక్షత్రాలు కొనాల్సొచ్చింది. అన్నీ కలిసి యిరవై వేల అప్పుతో అమ్మాజీ అత్తగారూరు హనుమాన్ జంక్షన్ వెళ్ళింది.

తను దాచుకున్న డబ్బుల్తో అమ్మాజీకి రెండు జతల గిల్టుగాజులు కొనిచ్చింది. అప్పుడెంత సంతోషమేసిందో! తనకీ, అమ్మాజీకి కూడా.

"ఆ పసిదానికున్న గ్యానమైనా నీకు లేదు" అని అమ్మ మళ్ళీ నాన్నతో తగాదా పెట్టుకుంది. పెళ్ళివాళ్ళ ఎదట మళ్ళీ ఎంకటేస్సర్రావు గోల తెచ్చాడు నాన్న.

అమ్మమ్మ ఇద్దర్నీ విడదీసి పరువు నిలబెట్టింది. అమ్మాజీ వెళ్ళిపోతే అమ్మకి నెలకి వెయ్యి రూపాయల ఆదాయం పోయింది. ఇరవై వేల అప్పు మిగిలింది.

"పెద్దపిల్లలిద్దరూ బుద్ధిమంతులేగానీ, మూడోదిమాత్రం జాణ. వాళ్ళమ్మ లాగానే దాని యీడుకి ఆ షోకులు చూడు. ఆ గోళ్ళరంగూ, ఆ చెవిపోగులూ, ఆ ఎత్తు చెప్పులూ, ఆ తల్లి ఎట్లా తయారై పనికి పోతుందో చూశారుగా... తింటానికి లేకపోయినా తల్లో పావుశేరు మల్లెపూలు కావాలి" అంటోంది నాగమణి ఒకరోజు.

అమ్మ శుభ్రంగా ఉతుక్కున్న చీరెకట్టుకుని తలదువ్వుకుని పనికిపోవటం కూడా వీళ్ళకి నచ్చదు. పైగా ఇప్పుడు తనని కూడా అంటున్నారు. అమ్మాజీ పెళ్లి అప్పు అమ్మకి దిగులు. ఎట్లా తీర్చాలో అర్థం గావటంలా...

"ఎంకటేస్సర్రావు గారి సుట్టాలింటో పనిపిల్ల గావాలంట. సంవత్సరానికి పదివేలిస్తారంట. అయిదువేలు అడ్మాన్సిస్తారంట. నేనుగూడా ఆయన దగ్గర ఒక అయిదువేలు అడ్మాన్సు అడుగుతా. పదివేలు తీర్తయ్... ఎల్తావా హైదరాబాదు? అంది ఒకరోజు అమ్మ ఉన్నట్టుండి. అప్పుడు నాన్న కూడా అక్కడే ఉన్నాడు.

"ఇంకోసారి వాడి పేరెత్తావంటే సంపేత్తా" అన్నాడు, మంచం మీదనుంచి లేచి కూచుని...

"మరి నువ్వు తీర్చు అప్పు" అంది అమ్మ.

"తీరుత్తా నువు ఆడి కొలువు మానెయ్"

"నువ్వు ఇల్లు చూసుకో నేనివ్వాళే మానేస్తా."

నాన్న మాట మార్చేశాడు. "ఈ భూపెపంచం మీన ఈ ఎంకటేస్సర్రావొక్కడే వున్నాడా నువ్వు పన్జెయ్యటానికి. ఆడిల్లు మానెయ్" అన్నాడు.

అమ్మ మాట్లాడలేదు.

"నువ్వు చెడింది కాక దాన్ని కూడ చెడగొట్టకు తెలిసిందా! అదేడకీ పోదు ఈణ్ణే ఉంటది" అన్నాడు.

"హైదరాబాదు పోను" అంది స్వర్ణ.

ఆపైన వారంరోజులపాటు అమ్మకీ స్వర్ణకీ, అమ్మకీ నాన్నకీ యుద్ధాలు.

"ఇక్కడ నీకొచ్చేది నెలకి అయిదొందలే కదే! అక్కడ ఇంకా ఎక్కువ. పైగా తిండీ బట్టా కూడా గడిచిపోతాయి. ఇంటిపట్టున ఉంటావు... మీ అమ్మ ఒక్క చేతి మీద ఇల్లు గడుపుకొస్తావుంది. పిల్ల పెళ్ళికూడా చేసింది. నువ్వు వెళ్ళమ్మా..." అని ఆదిలక్ష్మ్మ అత్తయ్య కూడా అదేపనిగా చెప్పింది.

"ఎంకటేస్సర్రావుగారికి అరవైఅయిదేళ్ళు. నాకన్న పాతికేళ్ళు పెద్దవాడు. తండ్రిలాంటాయన... మీ నాన్న ఏదో వాగాడని నువ్వు కూడా అట్ట మాట్టాడతావేంటీ.. ఆయన పెళ్ళాం పోతే నేను వండిపెడుతున్నా. అదేం తప్పా? నెలకి పదిహేను వందలిస్తున్నా డాయన. ఎప్పుడేమడిగినా లేదనడు. నాగమణి లాంటోళ్లకి అదే కడుపుమంట. మీనాన్నని ఎగసనదోస్తారు. ఆళ్ళు నాలాగ కష్టపడి పన్చెయ్యరు. పన్చేస్తే ఆళ్ళకి మాత్రం పనుల్లేవా..." అని అమ్మ చాలా చాలా చెప్పి వెళ్ళేదాకా పోరింది.

స్వర్ణ తను కలలో కూడా చూసెరగని హైదరాబాదులో అడుగు పెట్టింది. ఆరుగంటలకి నిద్రలేచి పనిలో పడితే రాత్రి పదింటికి పడకలోనే విశ్రాంతి. వెంకటేస్సర్రావు అక్క కూతురు శ్రీదేవమ్మకి ఇద్దరు పిల్లలు. పెద్దపిల్ల ఇప్పుడే బళ్ళో చేరింది. మూడున్న రేళ్ళు. రెండోదానికి ఏడాది. ఇల్లూడ్చి తుడవడం, అంట్లు తోమడం, పిల్లల్ని ఆడించడం

మొదలుగా ఇంకా చిల్లర పన్లు బోలెడు. మూడునెలల్లో మీటలు నొక్కే యంత్రంలా మారిపోయింది స్వర్ణ. యాడాదిలో ఒక్కసారి అమ్మనీ నాన్ననీ చూడ్డానికొచ్చింది.

"నీడ పట్టునుండీ శుబ్బరంగా తిని బాగున్నావు. పదివేలు సంపాయించావు.." అని ఆదిలక్షమ్మత్త మెచ్చుకుందే గానీ ఎంత తింటే మాత్తరం, ఇంటో వున్నట్టుంటుందా? తలా కాస్తా తెచ్చుకుని ఉన్నదాంటో కలిసి తినటం ఎంత బాగుంటుంది అనిపించింది. నాన్న బాగా చిక్కిపోయాడు. అమ్మ కూడా బాగా నలిగిపోయింది. అమ్మాజీ కూడా అదివరకంత వుషారుగా లేదు. అమ్మాజీ మొగుడికి మెకానిక్ షెడ్‌లో పని. జీతంబాగానే ఇస్తారంట. కాని దానిచేతికి రూపాయి కూడా ఇవ్వడు. ఇంట్లో పనంతా చేసినా అత్తకి సంతోషం లేదంట. తాగడంట కానీ పెళ్ళాం అంటే లోకువంట...

"మగాళ్ళంతా అంతేలే..!" అని సద్ది చెప్పింది అమ్మ.

"నాన్న చూడెలాగయిపోయాడో! ఆయన కేదైనా చేద్దామన్నా నాదగ్గర రూపాయి లేదు... ఇక్కడున్నప్పుడైతే పనిచేసి సంపాయించేదాన్ని... ఎప్పుడన్నా నాన్నకి అయిదూ పదీ ఇచ్చేదాన్ని... అమ్మమాత్రం ఎందాకా ఇస్తుంది. పైగా అప్పొకటి..." అని బాధ పడింది అమ్మాజి...

"ఈ ఏడాదికూడా శ్రీదేవమ్మ దగ్గర పనిచెయ్యమ్మా ఇంకో రెండువేలు జీతం పెంచుతానంది... కాస్త అడ్వాన్సు కూడా యిస్తానంది... నా తల్లివి కదే!" అని బ్రతిమాలి ఏడ్చి మొత్తుకుని మళ్ళీ హైదరాబాదు పంపింది అమ్మ. స్వర్ణ లేనిదే రోజు గడవదు శ్రీదేవమ్మకి... అప్పటికి పదహారేళ్లయినా లేని స్వర్ణ ఇంటి చాకిరీ మొత్తం నెత్తినేసుకుంది. అమ్మలాగే స్వర్ణకి సుబ్బరం ఎక్కువ. కాస్త షోగ్గా కనపడ్డం కూడా యిష్టం... చెవులకి పిచ్చివైనా రకరకాల పోగులు, గోళ్లకి రంగు, చేతులకి గోరింటాకు, తలపిన్నులు, ఇవ్వన్నీ పార్లర్‌లో పనిచేసినప్పుడు అలవాటయ్యాయి. వొళ్ళొంచి పనిచెయ్యడం, ఇష్టమైనవి కొనుక్కోడం, ఇవ్వన్నీ అమ్మ పోలికలే...

అప్పుడప్పుడు అమ్మ ఫోన్ పెడుతుంది. నాన్నకి ఈమద్దెన అసలేం బాగాలేదంట. ఆస్పత్రిలో చూపించి మందులు ఇప్పిస్తోందంట... ఎంకటేస్సర్రావుగారి చుట్టం పెద్ద డాక్టరంట. ఆయన డబ్బుల్లేకుండా చూసి ఏవో పరీక్షలు రాసిచ్చాడంట... పరీక్షలకే అయిదు వందలయినాయంట. మళ్ళీ ఎంకటేస్సర్రావుగారి దగ్గరే అప్పు చేసిందంట. ఇక తనకి శ్రీదేవమ్మ అడ్వాన్సులివ్వదు. ఇప్పటికే చాలా యిచ్చింది. ఇంకో నాలుగు నెలలు చేస్తేనే గాని మాట్టాడుకున్న పెకారం ఏడాది అవదు.

నాలుగునెలలు నాన్నని సూడకుండా వుండాలి. తాగీతాగీ పేణంమీదకి తెచ్చుకున్నాడు... నలభై ఆరేళ్ళంట ఇప్పుడు నాన్నకి. పెళ్ళికి అమ్మకి పదహారు, నాన్నకి

ఇరవైరెండంట. ఎంకటేస్స్రావుకి అరవై అయిదు. ఎంత దిట్టంగా వుంటాడో! రోజూ సాయంత్రం సైకిల్ తొక్కుతాడు. ఆయనకి తాగుడు లేదుకదా! డబ్బులుండాళ్ళు తెలివి గలాళ్ళు. ఎట్టా తాగాలో ఎంతతాగాలో ఆళ్ళకి తెలుసు. శ్రీదేవమ్మ మొగుడు కూడా తాగుతాడు. అప్పుడప్పుడు ఎవరైనా స్నేహితులొచ్చినప్పుడు. కానీ నాన్నలాగా కాదు. ఆళ్ళు తాగే సీసాలు ఖరీదైనవి కదా! అవి ఇట్టా జబ్బు చెయ్యవేమొ! శ్రీదేవమ్మ మొగుడుకి డబ్బు సంపాదనే ముఖ్యం. తరవాతే తాగుడు. నాన్న అట్టాకాదే! కొండ మీద శానామంది అంతే! కొంతమంది కష్టపడి పనిచేస్తారు. కానీ తాగేస్తారు. అన్నీ డబ్బుల్లోనే వున్నయ్... డబ్బులుంటే ఇంకా డబ్బులు సంపాయించొచ్చు. జబ్బు చెయ్యకుండా తాగొచ్చు. పిల్లలకి మంచిగా చదువు చెప్పించొచ్చు. సినిమాలు చూడొచ్చు. అందరూ కలిసి కూచుని తిట్టుకోకుండా నవ్వుకుంటూ అన్నం తినొచ్చు. అందరూ కలిసి అక్కడికీ ఇక్కడికీ వెళ్ళచ్చు. ప్రేమగా ఉండొచ్చు. నాన్నకీ డబ్బులుంటే అమ్మా నాన్నా శ్రీదేవమ్మా, ఆవిడి మొగుడూ మల్లే వుండేవాళ్ళు. అప్పుడు అమ్మ ఆ ఎంకటేస్స్రావుకు ఇంత చాకిరీ చేసే పని వుండేది కాదు. డబ్బులెట్లా వస్తయ్!! నాలుగు నెలలు తొందరగా అయిపోతే బాగుండును. ఇంక తను ఇట్టా ఇళ్ళల్లో ఉండదు. అక్కడే వాళ్ళతోపాటే వుండి పనిచేస్తుంది. ఇప్పుడు తనకి చాలా పనులొచ్చు. శ్రీదేవమ్మ తనని 'వజ్రాన్ని' సానబెట్టినట్టు పెట్టానని అందరికీ చెబుతూ వుంటుంది. సుబ్బరంగా తొందరగా పనిచెయ్యడం వచ్చు. ఈమధ్యనే వంట కూడా వచ్చేసింది. ఇంక అక్కడే ఏదన్నా పనిచూసుకుని నాన్నకి మందులిప్పించాలి.

నాలుగు నెలలు అయిపోయాయి. అడ్వాన్సులు పోగా మిగిలిన మూడువేలు తీసుకుని ఇంటికి వచ్చిన ఆరునెలలకే నాన్న వెళ్ళిపోయాడు. ఇదుగో ఈ కిటికీ పక్కనే మంచం మీద.. అట్టా పైకి చూస్తూ పడేకునేవాడు. అమ్మా తనూ వంతులేసుకుని కూచునే వాళ్లు. అమ్మ ఇంట్లో లేనప్పుడు తన చెయ్యి పట్టుకుని ఏడ్చేవాడు. తను అసమర్ధుడైనందువల్లే అమ్మ ఎంకటేస్స్రావుకి లొంగిపోయిందనేవాడు.

"అది తప్పునాన్నా! ఎంకటేస్స్రావుకి అమ్మ పనిచేసి పెడుతుందంతే! నేను చూసొచ్చా... ఆయన శానామంచోడు... అందుకే అమ్మ అక్కడ పన్జేస్తోంది... నువ్వట్టా అనమాక" అని తను చెప్పేది. ఆ సంగతి ఆయనకీ తెలుసనీ, పెళ్ళాన్ని కాస్త అదుపులో పెట్టటానికి అట్లా అంటాడనీ తరవాత అర్థం అయింది స్వర్ణకి... పాపం నాన్న మాత్రం ఏం చేస్తాడు! పెళ్ళాం పిల్లలకి అన్నం పెట్టలేకపోయానని లోపల బాధ... పైకి ఇట్లా అంటూ వుంటాడు. పల్లెటూళ్ళో వుండివుంటే నాన్న బాగుండేవాడని అమ్మ అంటుంది. అన్నతమ్ముల మధ్య తగాదాలవల్ల, తాతయ్య చేసిన అప్పులవల్ల, వడ్డీలవల్ల పొలంకాస్తా పోయి ఇట్టా బస్తీ బారినపడి ఇక్కడ ఉక్కిరిబిక్కిరై తాగుడికి అలవాటు పడి పెళ్ళాం సంపాదన మీద

బతుకుతున్నానని దిగులుపడి పేణం పోగొట్టుకున్నాడు అంటుంది అమ్మ. నాన్నమీద ఎప్పుడూ విసుక్కుంటూ ఆయన్ని తిడుతూ వుండే అమ్మ ఆయనపోతే అసలేడవదనుకుంది స్వర్ణ. కానీ అమ్మ బాగా ఏడ్చింది. నాన్న దినవారాలకి కూడా అప్పుచేసి ఖర్చు పెట్టింది. మరి అంత బాధ ఉన్నప్పుడు నాన్నని ఎందుకు తిట్టేదో! నాన్నని తిడుతూనే వుండేది, మళ్ళీ తన పని తను చేసుకుపోతూనే వుండేది.

నాన్న కొట్టినా ఏడుస్తూ కూచోకుండా మళ్ళీ తలదువ్వుకుని మొహం కడుక్కుని పనికి పోయేది.

"మనకి రెండెకరాల పొలం వుండేది. ఒక ఇల్లుండేది. చుట్టూ చోటుండేది. బాగా గాలాడేది. అంతా పోయింది. ఇదుగో ఇట్టా ఈ ఊరొచ్చి ఇక్కడ సావాల్సొచ్చింది" అనేవాడు. పొలం ఎందుకు పోయింది నాన్నా అంటే నా కర్మ అనేవాడు. అప్పుడే ఎంకటేస్సర్రావు కొడుకులొచ్చి ఆయన్ని ఆర్నెల్లపాటు అమెరికా తీసుకుపోయారు. అమ్మకి పనిపోయింది. ఇంకోపని వెతుక్కోవాల్సి వచ్చింది. నాన్నని చూడ్డానికొచ్చిన అమ్మాజి తనకి పెళ్ళి చెయ్యకుండా వుంటే బాగుండేదని ఏడ్చింది. "అందరం తలా కాస్త సంపాయించుకుని బతికేవాళ్ళం అప్పులేల్లేకుండా" అని... ఆడపిల్లకి పెళ్ళి చెయ్యకపోతే ఎట్టాగే అని అమ్మ సముదాయించేది. అమ్మకి ఒక హోటల్లో పని కుదిరింది... స్వర్ణ కూడా పనులు కుదుర్చుకుంది. పదహారేళ్ళ స్వర్ణకిప్పుడు చేతకాని పనంటూ లేదు. పెద్ద ఆరిందా అయిపోయింది. ఎంత కష్టపడ్డా ఏం లాభం! నాన్న బతకలేదు... "ఆ మనిషి ఉండి నిన్నేం సుఖపెట్టాడమ్మా! అట్టా మంచంలో వుంటే మాత్తరం ఆయనకి సుకమా, నీకు సుకమా!" అని సముదాయించింది అమ్మమ్మ.

"నిండా నలభై ఏళ్ళు లేవు. అప్పుడే పసుపుకుంకాలు పోయాయి" అని విచారించారు కొందరు...

"ఎట్టాగో దీనికి కూడా పెళ్ళిచేసి ఒడ్డెక్కించావంటే నువ్వొక్కదానివే ఎట్టయినా బతకొచ్చు. నీ తమ్ముడి దగ్గరకైనా పోవచ్చు" అని సలహా యిచ్చింది నాగమణి.

నాగమణి కొడుక్కి స్వర్ణమీద ఆశ. దుర్గ అడిగితే కాస్తబెట్టు చేసి కట్నం లేకుండా చేసుకోవాలని నాగమణికి కూడా వుంది. స్వర్ణ చూడ్డానికి బాగానే వుంటుంది. కష్టపడి పనిచేస్తుంది. కానీ స్వర్ణకి అతను నచ్చడు. అతని చూపు నచ్చదు. నాగమణి అసలే నచ్చదు. ఆవిడే అమ్మ మీద నాన్నకి చాడీలు చెప్పేది.

"మీరిద్దరూ ఈ బస్తీలో ఎందుకే ! నా దగ్గర కొచ్చెయ్యండి. అక్కడైనా పొలం పన్లు చేసుకోవచ్చు. ఇంటి అద్దె వుండదు. నీ తమ్ముడే నీ మంచీ చెడూ చూసుకుంటాడు." అని అమ్మమ్మ బలవంతం చేసింది...

"నీ కోసం మసాలా దోసె తెచ్చా తిను" అని అమ్మ అనే వరకూ ఈ లోకంలో లేదు స్వర్ణ. ఆకలిగా వుంది. అమ్మతో తగాదా పెట్టుకునే ఓపిక లేదు. మాట్లాడకుండా దోసె తినేసి అమ్మ పెట్టిచ్చిన కాఫీ తాగేసి కూచుంది. అమ్మ పొయ్యి వెలిగించి గిన్నెతో నీళ్ళు కాగబెట్టి ఆ మంట మీదే చిన్న గిన్నెతో అన్నం పడేసివచ్చి "పోయి స్నానం చెయ్యి. కాస్త వొళ్ళు నెప్పులు తగ్గుతయ్" అంది.

ఆమె అట్లా అంటూండగానే అతనొచ్చాడు. స్వర్ణ మొగుడు. ఆమెని పొద్దున చావకొట్టినవాడు, తనకాహక్కున్నట్లు భావించినవాడు... దుర్గమ్మ అల్లుడు.

అతన్ని గుమ్మంలో చూస్తూనే స్వర్ణ తడికె అవతలకి స్నానానికి పోయింది.

"దాన్ని తీసుకపోదామనొచ్చా... ఇట్టా తేపా అలిగొస్తే నేనొచ్చి తీసుకుపోను. ఏదో ఈపాలి వచ్చాను" అన్నాడు.

"వద్దులే ఈపాలికూడా తీసుకుపోవద్దు ఈడ్నే వుండనియ్" అంది దుర్గ.

"అదేంది.... పెద్దదానివి దానికి చెప్పి పంపక ఇట్టా మాట్టాడతావు"

"నేనంతే"

"దాన్ని పిలువు నే మాట్టాడతా..."

"అది నీతో రాదు"

అతనికి కోపం వచ్చింది "ఇప్పుడు రాకపోతే ఎప్పటికీ రావద్దు" అన్నాడు.

స్వర్ణ స్నానం చేస్తూనే వుంది.

"రాదులే నువ్వు పో..."

అతను తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. దుర్గ తలుపేసింది.

బయటికొచ్చిన స్వర్ణ, తలుపు పక్కనే చతికిలపడ్డ దుర్గ ఒకళ్ళ మొహాలు ఒకరు చూస్తూ వుండిపోయారు.

"కష్టాలన్నీ మనకే వస్తున్నయ్" అంది దుర్గ. ఒక నిమిషం ఆగి.

"నా మాటిన్నావా, నేను మొదట్నించీ ఆ తింగరోణ్ని చేసుకోనని చెప్తానే వున్నా" అని కస్సుమంది స్వర్ణ.

"నలుగురు మాట ఇనే కదే..." అని కూతురి మొహంలోకి నిస్సహాయంగా చూసింది దుర్గ.

"చెప్పే ఆళ్ళకి బుద్ధి లేదు ఇనే వాళ్ళకీ లేదు. ఏం చేసుకుంటావో చేసుకో ! నేను మాత్తరం అది కాడికి సచ్చినా పోను".

పొమ్మని తను మాత్రం ఎట్టా చెబుతుంది ?

"అసలు అమ్మమ్మ కాడికి పోవడం తప్పు. నా తమ్ముడు నా తమ్ముడని ఎగిరావ్

గా...ఏం జేసాడు నీ తమ్ముడు. కనీసం నెలరోజులైనా కూచోపెట్టి తిండి పెట్టాడా ? నిన్ను పొలం పనికి తోలాడు. నాచాత అడ్డమైన చాకిరీ చేయించాడు. ఆ చాకిరి ఇక్కడ చేసుకుంటే మనకి డబ్బులొచ్చేవి. మన తిండి మనం తినేవాళ్ళం. పైగా నామీద సతాయింపులు. షోకులు చేసుకుంటానని తిట్టటం. ఇదిగో నీ తల్లీ, నీ తమ్ముడూ కలిసి చేసిన మేలు ఈ దెబ్బలూ.."

దుర్గకి తెలుసు. అందుకే దుర్గ అక్కడ్నించీ వచ్చేసింది... రెండు రోజులు అమ్మాజి వుంటే సహించలేకపోయాడు. తన యిల్లంటూ తనకి కావాలి. తన డబ్బులంటూ తనకి కావాలి. నాగమణి మాత్తరం తక్కువదా ? పాటికి పదిసార్లు అమ్మ దగ్గరికొచ్చింది. పిల్లనిస్తేనే చాలని బతిమాలింది. పెట్టుపోతల మాటే ఎత్తనంది.... పూలల్లో పెట్టి చూసుకుంటాడు నా కొడుకంది.

"నిచ్చేపంగా ఆటో తోల్తా ఉన్నాడు. రోజుకి ఎంతకాదన్నా వందా నూటేభై వస్తయ్. పొకైనా సొంతది...నామాటిని ఒప్పుకోవే...మీ అమ్మకి భారం తీర్తది" అని అమ్మమ్మా మామయ్యా ఆఖరికి పెద్దక్క కూడా పోరు పెట్టింది.... మెడలొంచి పెళ్ళి చేశారు...

మూడు నెల్లు కాలేదు. వాడి అవతారం బయటపడింది. తేపా అమ్మ సంగతి ఎత్తుతారు నాగమణీ, ఆవిడ కొడుకు. తనకి అమ్మ పోలికంట... ఎక్కడలేని సోకులంట... బయట పనికి పంపిస్తే ఎవడితోపడితే వాడితో సంబంధం పెట్టుకుంటుందంట. ఇట్టా మాట్టాడతారు. ఇంట్లోంచి బయటికి పోనీరు. చుడీలేసుకుంటే వూరుకోరు. ముందేమో అన్నిటికి ఒప్పుకుని ఇప్పుడిట్టా... కంపరం కంపరం ఈ కాపరం... థూ ఇల్లు సుబ్బరంగా ఉండకూడదు, మనిషి సుబ్బరంగా వుండకూడదు. యిష్టమైంది వండుకు తినకూడదు. సినిమాకి పోకూడదు. అమ్మాజీని చూడపోకూడదు. బావ ఏమైనా అంటే నవ్వకూడదు. సొంత మేనమామ అయిన పెద్దబావ పక్కన కూచోకూడదు. ఇదీ తన కాపరం.... థూ... ఒళ్ళుమండి చెడామడా తిట్టింది తల్లినీ, కొడుకునీ కలిపి. అప్పుడు తల్లి ఇంట్లో లేదు. దాని ఫలితం యిదీ.... సుబ్బరంగా స్నానం చేసి ఉతికిన బట్టలు కట్టుకుని తలదువ్వుకుని చెవులకి పోగులూ చేతికి గోరింటాకూ, కాళ్ళకి పట్టీలూ పెట్టుకుంటే అది సోకంట. దుర్గకి తెలుసు ఇక స్వర్ణ వాడికాడికి ఎవరు చెప్పినా పోదని. అందుకు వాళ్ళతో తగాదా పడ్డానికి తను సిద్ధమైపోవాలి...ఈలోగా అమ్మాజీ పురిటికొస్తుంది. మళ్ళీ స్వర్ణా, తనూ కాడి భుజానికెత్తు కోవాలి. *

(స్త్రీ సంఘటన, జూన్-ఆగస్టు 2008))